క్లుప్తంగా

కమ్మతిమ్మపల్లి - బెంగళూరు సర్వీసు ప్రారంభం



బస్సు ప్రారంభోత్సవంలో జెడ్పీటీసీ సభ్యుడు ఎంఎస్ బాబు నాయుడు

చిత్తూరు రూరల్: మండలంలోని కుర్చివేడు గ్రామంలో సోమవారం కమ్మతిమ్మపల్లి - బెంగళూరు సర్వీసును జెడ్పీటీసీ ఎంఎస్ బాబు నాయుడు ప్రారంభించారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానంద రెడ్డికి విన్నవించిన మేరకు మండల నాయకులు, ప్రజలు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని విన్నవించారు. ఈ మేరకు ఆయన స్పందించి బస్సు సౌకర్యం కల్పించారు. ఈ సౌకర్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గోవిందనాయుడు, రవినాయుడు, సూరి నాయుడు, ప్రవీణ్, జయచంద్ర, రాజేంద్ర, కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పొలంలో ఫారంపాండ్



ఫారంపాండ్‌ను పరిశీలిస్తున్న పీడీ గంగాభవాని

యాదమరి: మండలంలోని ప్రతి రైతు తన పొలంలో ఫారంపాండ్ ఏర్పాటు చేసుకోవాలని ఉపాధిహామీ పథకం పీడీ గంగాభవాని స్పష్టం చేశారు. మండలంలోని జంగాలపల్లె పంచాయతీ గ్రామాల్లో సోమవారం పలువురు రైతులు తమ పంట పొలాల్లో నిర్మించుకుంటున్న ఫారంపాండ్స్‌ను ఆమె పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ మండల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం 200 ఫారంపాండ్స్ మంజూరు చేసిందన్నారు. ఐదు ఎకరాల్లోపు ఉన్న రైతులు తమ పంట పొలాల్లో ఫారంపాండ్స్ నిర్మించుకుంటే నీటిని ఆదా చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ బాల తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.2 లక్షల విరాళం



విరాళం అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి నిత్యఅన్నదానానికి రూ.2 లక్షల విరాళం అందింది. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికు చెందిన రంగారావు, గచ్చిబౌలికి చెందిన బాలాజీ లక్ష చొప్పున విరాళాన్ని ఆలయ అధికారులకు అందించారు. వీరు కుటుంబ సభ్యులతో కలసి స్వామివారి దర్శనార్థం విచ్చేయడంతో ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వైద్య సేవలు అందిస్తున్నాం



వైద్య సేవలందిస్తున్న వైద్యులు

గుడిపాల: ప్రతి గ్రామంలో సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నామని డాక్టర్ అనూష అన్నారు. పానాటూరు గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ వైద్యసేవలు అందించనున్నట్లు చెప్పారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా మంచానికే పరిమితమైన రోగుల ఇంటి వద్దకే వెళ్లి వైద్యం అందిస్తున్నట్లు వివరించారు. అనంతరం 66 మంది గర్భిణులు, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది యమున, ప్రియాంక, మణిమేఘల, భారతి తదితరులు పాల్గొన్నారు.

బాపూజీ కలకు ప్రతిరూపం

- పల్లె ముంగిట్లో సచివాలయం
- గ్రామీణ ప్రజలకు చేరువైన ప్రభుత్వ సేవలు
- మండల కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలకు చెక్



గ్రామ సచివాలయంలో ఆధార్ సేవలు అందిస్తున్న సిబ్బంది

బంగారుపాళెం: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. ప్రతిఫలంగా గ్రామ సచివాలయ వ్యవస్థ పురుడుపోసుకుంది. ప్రభుత్వ పాలన ప్రజల ముంగిట్లోకి వచ్చింది. మండల కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసే కష్టాలకు మంగళం పలికింది. ప్రజా సంకల్పయాత్రలో చెప్పిన విధంగా ప్రతి 2 వేల జనాభా కలిగిన గ్రామానికి సచివాలయాన్ని ఏర్పాటు చేసింది. లక్షలాదిమంది నిరుద్యోగులకు సచివాలయాల్లో ఉద్యోగాలు కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కింది. మండలంలో 27 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ఒక్కొక్క సచివాలయంలో వివిధ విభాగాలకు చెందిన 11 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. మండలంలోని గ్రామ సచివాలయాల్లో దాదాపు 340 మంది ఉద్యోగులు ఉన్నారు. ప్రతి సచివాలయంలో 545కు పైగా సర్వీసులను ఉద్యోగులు సకాలంలో ప్రజలు, రైతులు, విద్యార్థులకు అందిస్తున్నారు. ప్రజల మన్ననలు పొందుతున్నారు. సచివాలయాలకు అనుబంధంగా ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల ఇళ్ల వద్దకే అందుతున్నాయి. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించడంతో ఆయా కుటుంబాల ప్రజలకు ప్రభుత్వ సేవలు, పథకాలు పొందడంపై అన్ని విధాలా భరోసా కలిగింది. అర్హత ఉంటే చాలు కుల మతాలు, రాజకీయ పార్టీలకు సంబంధం లేకుండా పథకాలు మంజూరు చేసి ఇంటి వద్దకే అందిస్తున్నారు. గతంలో మాదిరిగా దళారీ వ్యవస్థ లేకుండా పోయింది. వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రాల్లోని కార్యాలయాల చుట్టూ తిరగకుండా గ్రామాల్లోనే తమ సమస్యలు పరిష్కారం అవుతున్నట్లు లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆధార్ సేవలు సైతం

వివిధ సంక్షేమ పథకాలు పొందేందుకు ఆధార్ తప్పనిసరి కావడంతో గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవలు సైతం అందిస్తున్నారు. మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో ఇప్పటికే పూర్తి స్థాయిలో సేవలు అందుతున్నాయి. దీంతోపాటు ఆయా గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు వేలాది మందికి ఆధార్ సేవలు అందించారు.

గ్రామ స్వరాజ్యం

జాతిపిత మహాత్మాగాంధీ కన్న కలలకు ప్రతిరూపాలుగా గ్రామ, వార్డు సచివాలయాలు ఆవిర్భవించాయి. గ్రామ స్వరాజ్యాన్ని ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. ప్రతి సచివాలయంలో గ్రేడ్- 5 పంచాయతీ కార్యదర్శులతో పాటు, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీస్, డిజిటల్ అసిస్టెంట్, వ్యవసాయ, వెటర్నరీ, సర్వేయర్, వీఆర్‌ఓ తదితర అధికారులు అందుబాటులో ఉంటారు. జిల్లా, మండల కేంద్రాలలో ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తుంటే, గ్రామ సచివాలయాల్లో ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అవినీతికి తావులేకుండా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా గ్రామ సచివాలయాలు పని చేస్తున్నాయి.



మొగిలివారిపల్లెలో గ్రామ సచివాలయం

ఇంటికే వచ్చింది పింఛన్



నేను ఏనాడూ ప్రభుత్వ కార్యాలయాల వద్దకు వెళ్లలేదు. గ్రామ వలంటీర్ ఇంటివద్దకే వచ్చి అర్హత గురించి తెలుసుకుని పింఛన్‌కు దరఖాస్తు చేయమని చెప్పడంతో ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్సు పత్రాలను ఇచ్చాను. వలంటీర్ సచివాలయంలో దరఖాస్తు చేయించింది. కొన్ని రోజులకు పింఛన్ మంజూరైంది. ప్రతి నెలా ఒకటో తేదీనే రూ.2,750 పింఛన్ సొమ్ము అందుకుంటున్నాను. ఈ సొమ్ము జీవనాధారానికి ఎంతో ఉపయోగపడుతుంది.

\- భారతి, తగ్గువారిపల్లె, బంగారుపాళెం

సచివాలయ వ్యవస్థకు మంచి గుర్తింపు



గతంలో 1బీ, అడంగల్ కోసం గంటల తరబడి కార్యాలయం వద్ద పడిగాపులు కాసే పరిస్థితి ఉండేది. సచివాలయాలు వచ్చిన తరువాత రైతులకు అవసరమైన సేవలు త్వరితగతిన తక్కువ ఖర్చుతో పూర్తవుతున్నాయి. సచివాలయాల్లో సులభంగా, అవినీతి రహితంగా పనులు జరుగుతున్నాయి. గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యం కల సాకారం చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుంది. సచివాలయ వ్యవస్థకు దేశంలోనే మంచి గుర్తింపు వచ్చింది.

\- త్యాగరాజరెడ్డి, రైతు, జిల్లేడుపల్లె

ఇంటి స్థలం మంజూరు



గ్రామ సచివాలయంలో వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకున్నా. 90 రోజుల్లోనే నాకు ఇంటిపట్టా అందజేశారు. గతంలో ప్రతి పనికీ మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లోనే సమస్యలను పరిష్కరించేందుకు సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టడం ఎంతో సంతోషంగా ఉంది. ఉన్న గ్రామంలోనే సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసిన సీఎంకు కృతజ్ఞతలు.

\- లక్ష్మి, గృహ లబ్ధిదారు, తగ్గువారిపల్లె

నేడు వై ఏపీ నీడ్స్ జగన్

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక జానకరపల్లి, రంగచ్చారివీధి డివిజన్లలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షులు జ్ఞానజగదీష్ సోమవారం తెలిపారు. మధ్యాహ్నం 3.30 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొంటారని చెప్పారు.

ఆలయ అధికారులకు సమావేశం నేడు

కాణిపాకం(యదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ అధికారులకు మంగళవారం సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వెంకటేశు తెలిపారు. ఆంగ్లనూతన సంవత్సరం సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండాస్వామివారి దర్శనం కల్పించడానికి సమవేశం నిర్వహించనున్నట్లు వివరించారు. దీనికి పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, కలెక్టర్ సగిలి షణ్మోహన్, ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు తెలిపారు. దీనికి ఆలయ అధికారులు అందరూ హాజరు కావాలని కోరారు.

నెలాఖరు వరకు విధుల బహిష్కరణ

చిత్తూరు అర్బన్: ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌ను వ్యతిరేకిస్తూ ఈ నెలాఖరు వరకు విధులను బహిష్కరిస్తున్నట్లు చిత్తూరు న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాజేంద్రరెడ్డి, అశోక్ ఆనంద్‌యాదవ్ ఓ ప్రకటనలో తెలిపారు. సర్వసభ్య సమావేశ తీర్మానం మేరకు అన్ని న్యాయస్థానాల్లో విధులను బహిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

చిత్తూరు కలెక్టరేట్ : ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ కోరారు. ఈ మేరకు ఆ సంఘ నాయకులు సోమవారం డీఆర్‌ఓ రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పీఆర్‌సీ ముందు ఉన్న డీఏ బకాయిలను, పీఆర్‌సీ తర్వాత ఇచ్చిన డీఏ బకాయిలను మంజూరు చేయాలన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఉద్యమబాట పట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్‌నాయుడు, మనిగండన్, నాయకులు రెహానబేగం,ఎస్‌పీ బాషా పాల్గొన్నారు.

గర్భిణులకు గ్రామాల్లోనే వైద్యం



గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

గుడిపాల: గర్భిణులకు వైద్యం గ్రామాల్లోనే అందుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లోనే సచివాలయాలు ఏర్పాటు చేసి ప్రజలకు సేవలన్నీ అక్కడి నుంచే విధంగా చేస్తున్నారు. దీంతో పాటు వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను గ్రామాల్లోనే ఏర్పాటు చేశారు. గతంలో ఆస్పత్రులకు వెళ్లాలంటే మండల కేంద్రాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేయడంతో ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు గ్రామాల్లోనే అందుతున్నాయి. ముఖ్యంగా గర్భిణులకు సంబంధించి అన్ని వైద్య పరీక్షలను వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో అందించడంతోపాటు వారికి అవసరమైన మందులను కూడా ప్రభుత్వం ద్వారా అందజేస్తున్నారు. దీంతో పాటు గర్భిణులకు వ్యాయామాన్ని ఏఎన్‌ఎంల ద్వారా నేర్పిస్తున్నారు. ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఆహారం ఎన్నిసార్లు ఎలా తీసుకోవాలి అన్న విషయాలను జాగ్రత్తగా వారికి వివరిస్తున్నారు. ప్రతి వారంలో ఒకరోజు డాక్టర్ వచ్చి పరీక్షలు చేస్తున్నారు. గర్భిణులు గతంలో వేల రూపాయలు ఆస్పత్రులకు ఖర్చులు చేసేవారని, ప్రస్తుతం ప్రభుత్వం ఇంటివద్దకే వచ్చి వైద్యం ఉచితంగా అందజేస్తోందని మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పేదవాడికి మెరుగైన వైద్యమే జగనన్న లక్ష్యం



బంగారుపాళెంలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

బంగారుపాళెం: రాష్ట్రంలో ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎంపీపీ అమరావతి అన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం అందించే కార్యక్రమాన్ని సోమవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లె సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో అధికారులు, ప్రజాప్రతినిధులు వీక్షించారు. ఎంపీపీ మాట్లాడుతూ, పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన ఉచిత కార్పొరేట్ వైద్యం అందించే విషయంలో ప్రభుత్వం ఆరోగ్యశ్రీలో వ్యయ పరిమితిని రూ.25 లక్షలకు పెంచిందన్నారు. దాంతో పాటు స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అర్హులకు ఉచిత వైద్యాన్ని అందించేందుకు ఆరోగ్యశ్రీ యాప్‌ను మొబైల్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేయించి వైద్య సేవలకు ఎక్కడకు వెళ్లాలి, సేవలు ఎలా పొందాలి, ఎవరికి వివరించాలనే విషయాలపై వలంటీర్లతో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ రమావాణి, ఇన్‌చార్జి ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి, ప్రజా ప్రతినిధులు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఆరోగ్యశ్రీ

పూతలపట్టు: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ వ్యయ పరిమితిని రూ.25 లక్షలకు పెంచుతూ సీఎం జగన్ ప్రారంభించిన కార్యక్రమాన్ని ఎంపీడీఓ కార్యాలయంలో మండల నాయకులు, అధికారులు వీక్షించారు. వైఎస్సార్‌సీపీ పెనుగొండ పరిశీలకులు బాబురెడ్డి, ఎంపీపీ కుమారి, పార్టీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, ఎంపీడీఓ గౌరి, ఏపీఓ సంధ్యారాణి, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, డాక్టర్లు ప్రియాంక, ప్రవీణా, జశ్వంత్, నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ పథకం ప్రజలకు వరం

తవణంపల్లె: ఆరోగ్య శ్రీ పథకం ప్రజలకు వరమని తవణంపల్లె ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ తెలిపారు. ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.25 లక్షల వరకు పెంచుతూ సోమవారం ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించిన కార్యక్రమాన్ని ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు వీక్షించారు. మండల సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు హరిరెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఐరాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ నాగరాజు అన్నారు. మండలంలోని బీరప్పచెరువు, పుత్రమద్ది గ్రామాల్లో సోమవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులు కేంద్ర ప్రభుత్వ పథకాలను శాఖల వారీగా వివరించారు. గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పథకాల వివరాలతో కూడిన వీడియోలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఐరాల సర్పంచ్ గుణవతి, ఏఓ వరలక్ష్మి, డాక్టర్ పూర్ణలత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి

పూతలపట్టు: మండలంలోని పి.కొత్తకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు పాకాల లయన్స్ క్లబ్ సభ్యులు తులసీరామ్ తన ఆర్థిక సహకారంతో క్రీడా సామగ్రిని అందజేశారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గోపి ఆధ్వర్యంలో సోమవారం రూ.15 వేల క్రీడాసామగ్రిని అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం తులసీరామ్‌ను సన్మానించారు. ఆంజనేయులు, రామయ్య, సర్పంచ్ పద్మజరాణి, మస్తాన్, కుప్పస్వామి పాల్గొన్నారు.

సకాలంలో గర్భిణుల నమోదు

యాదమరి: మండలంలో ఉన్న అర్హులైన గర్భవతుల వివరాలను సకాలంలో నమోదు చేయాలని వైద్యాధికారి అరుణ్‌కుమార్ నాయక్ కోరారు. మండలంలోని ప్రభుత్వాస్పత్రిలో సోమవారం ఆయన ఏఎన్‌ఎంలతో సమావేశమయ్యారు. ప్రధానమంత్రి మాతృత్వ వందనం కార్యక్రమం కింద అర్హులైన గర్భవతుల వివరాలు నమోదు చేయాలని సూచించారు. మొదటి, రెండవ సారి గర్భం దాల్చిన మహిళలు, రెండో కాన్పులో ఆడ శిశువు జన్మించిన వారికి పీఎంవీవై పథకం కింద నగదు మంజూరు చేయనున్నట్లు వివరించారు.

21న ధార్మిక సమ్మేళనం

తవణంపల్లె: మండలంలోని అరగొండ- గాజులపల్లె రోడ్డులోని ఈశ్వర గుడి గౌరీశంకర్ కల్యాణ మండపంలో ఈ నెల 21వ తేదీన సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హిందూ ధార్మిక సమ్మేళనం నిర్వహించనున్నట్లు కార్య నిర్వాహకులు అనంత పద్మనాభయ్య తెలిపారు. కార్యక్రమానికి ఎస్ఎస్ఐ కమిటీ నాయకులు హాజరవుతారని వివరించారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఆరోగ్యానికి భరోసా



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత



పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

ఐరాల: గ్రామీణ ప్రాంత నిరుపేదలకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోందని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని బీరప్పచెరువులో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 96 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి, వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఎగువ తడకరలో ఫ్యామిలీ డాక్టర్

తవణంపల్లె: మండలంలోని ఎగువ తడకరలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భవతులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గర్భిణులు రక్తహీనత రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలోవైద్య సిబ్బంది,ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలకు కౌన్సెలింగ్

సాక్షి ఎఫెక్ట్..



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్ : నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం సాయంత్రం కమిషనర్ అరుణ కారుణ్య నియామకాలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కారుణ్య నియామకాల సమస్య పై నవంబర్ 30 న సాక్షి లో కథనం ప్రచురితమైంది. ఈ కథనం పై స్పందించిన కమిషనర్ సోమవారం నియామకాల కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు. నియామకాలకు అర్హులైన అభ్యర్థుల సర్టిఫికెట్‌లను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తూ ఆరుగురు మృతి చెందారని తెలిపారు. వారి పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. పోస్టుల భర్తీకి ఆప్షన్‌లను తీసుకున్నట్లు తెలిపారు. అభ్యర్థుల విద్యార్హత మేరకు అందుబాటులో ఉన్న పోస్టుల్లో నియామకాలు చేపడుతామన్నారు. కసరత్తు వేగవంతం చేసి నియామకపత్రాలు అందజేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంఈ గోమతి, ఎంహెచ్‌ఓ లోకేష్, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షింతల ఊరేగింపు



అక్షింతలను ఊరేగింపుగా తీసుకెళుతున్న భక్తులు

గుడిపాల: మంగళ హారతులతో అయోధ్య రాముడి అక్షింతలను సోమవారం ఊరేగించారు. మండలంలోని రామభద్రాపురంలో ఎంపీటీసీ గొల్ల హరిప్రసాద్ ఆధ్వర్యంలో విశ్వహిందూ పరిషత్ నేతలు పురవీధుల్లో ఊరేగింపుగా వెళ్లి గ్రామంలోని దేవాలయంలో పూజలు చేశారు. రాముడి అక్షింతల ముడుపును అక్కడ భద్రపరిచారు. గ్రామస్తులు సందీప్, సురేంద్రనాయుడు, సందీప్, రఘుపతి పాల్గొన్నారు.

మహిళల గౌరవం పెంచిన ప్రభుత్వం



చిత్తూరు: వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న మేయర్ అముద, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



బంగారుపాళెం: జిల్లేడుపల్లెలో ప్రజలకు పథకాలను వివరిస్తున్న ఎంపీపీ అమరావతి

చిత్తూరు కార్పొరేషన్: గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని మోసం చేయడంతో మహిళలు ఆర్థికంగా ఎంతో నష్టపోయారని మేయర్ అముద, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. గాయత్రీ నగర్, తేనెబండ, బజారువీధి సచివాలయాల పరిధిలో సోమవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సచివాలయాల్లో సంక్షేమ పథకాలను తెలిపే బోర్డు, కూడళ్లలో వైఎస్సార్‌సీపీ జెండాలను ఆవిష్కరించారు. మూడు డివిజన్ల పరిధిలో ఇప్పటి వరకు రూ.44.74 కోట్లు అభివృద్ధి, సంక్షేమం కోసం ఖర్చు చేశామన్నారు. పేదలకు సొంతింటి కలను సాకారం చేస్తున్నామన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో టీడీపీ, జనసేన, బీజేపీలు మాయమాటలు చెబుతున్నాయన్నారు. 2014–2019 వరకు వీరందరూ కలిసే ఉన్నా సంక్షేమం, అభివృద్ధి ఏమాత్రం చేయలేదని గుర్తుచేశారు. మంచి చేస్తున్న మన ప్రభుత్వంపై ఎల్లో మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, నగర పార్టీ అధ్యక్షులు జ్ఞానజగదీష్, టిమ్ము, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, మహిళ జిల్లా అధ్యక్షురాలు లీనారెడ్డి, నగర సచివాలయ కన్వీనర్లు రాంగణేష్, కిరణ్, కార్పొరేటర్లు రాయల్ కుట్టి, గంగ, డివిజన్ ఇన్‌చార్జి సీతాపతి నాయకులు షరీఫ్, అల్తాఫ్ పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నే రావాలి

బంగారుపాళెం: రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలు బాగుపడాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా గెలిపించుకోవాలని ఎంపీపీ అమరావతి అన్నారు. మండలంలోని జిల్లేడుపల్లె గ్రామ సచివాలయంలో సోమవారం సాయంత్రం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం ద్వారా అర్హులకు అందిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి వివరాలకు సంబంధించిన బోర్డును ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కష్టాలను తెలిసిన నాయకుడనీ, ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వెనక అడుగు వేయలేదని గుర్తుచేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని తెలిపారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భారతమ్మ, ఎంపీటీసీ సభ్యుడు శంకర్‌రెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్ కుమార్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మంచిని వివరించాలి

యాదమరి: ప్రతి గ్రామంలో ప్రభుత్వం చేసిన మంచిని వివరించాలని జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని కీనాటంపల్లె సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో సోమవారం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ప్రభుత్వ పథకాల ఫలాలను వివరించే కరపత్రాలను లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి, వైస్ ఎంపీపీలు రవీంద్రబాబు, హరనారాయణ రెడ్డి, ఎంపీటీసీ డానివేలు తదితరులు పాల్గొన్నారు.